క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు పూజలు చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, భక్తులు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలంకరించి, హారతి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పర్యవేక్షించారు.

కృష్ణ.. మహేష్‌బాబు అభిమానుల ఆత్మీయ కలయిక



ఉమ్మడి అప్పారావును సత్కరిస్తున్న అభిమానులు

దాబాగార్డెన్స్: విశాఖపట్నం కృష్ణ అండ్ మహేష్‌బాబు ఫ్యాన్స్ ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. నగరంలోని ఓ పిక్నిక్ స్పాట్‌లో వీరంతా కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా సీనియర్ అభిమాని, విశాఖపట్నం పోర్టు రైల్వే అసిస్టెంట్ యార్డ్ మాస్టర్ ఉమ్మడి అప్పారావు పదవీ విరమణ సందర్భంగా అభిమానులందరూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, బుజ్జి ఫ్రెండ్‌సర్కిల్, పెద్ద ఎత్తున కృష్ణ అండ్ మహేష్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

కుసుమ హరనాథ ఆశ్రమంలో కార్తీక సమారాధన



ఆశ్రమంలో వెలసిన కుసుమ హరనాథులు

దాబాగార్డెన్స్: స్థానికంగా ఉన్న కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ నేతృత్వంలో ఆదివారం కార్తీక సమారాధన ఘనంగా నిర్వహించారు. ముందుగా మందిరంలో వెలసిన కుసుమ హరనాథులకు ప్రత్యేక పూజలు జరిపారు. ఎం. విజయలక్ష్మి, కామేశ్వరిచే సంకీర్తన, భక్తులచే సామూహిక షోడశాక్షరి నామ సంకీర్తన, భక్తి గీతాలాపన నిర్వహించారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్‌చే ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా కార్తీక మాస ప్రాముఖ్యత వివరించారు. కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షుడు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీఎస్ రమేష్, సహాయ కార్యదర్శి కె. మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కాలువలు

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి స్వీపర్ కాలనీ కొండవాలు ప్రాంతంలో కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలనీలోని ప్రతి వీధిలో కాలువల్లో కాంక్రీట్ పైకి తేలిపోవడంతో మురుగునీరు సక్రమంగా ప్రవహించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో కాలువలు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు కావడంతో పనులు ప్రారంభించ లేదు. దీంతో కాలనీలో పరిసరాలు అధ్వానంగా మారాయని, దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిమెంటు కాంక్రీట్ కాలువలు నిర్మించమని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు, స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలు నిత్యకృత్యం

- లోపభూయిష్టంగా సాయిబాబా వీధి కల్వర్ట్ నిర్మాణం
- రోజూ జారి పడుతున్న స్థానికులు
- రోడ్డు కంటే ఎత్తుగా నిర్మించటమే కారణమంటున్న ప్రజలు



సాయిబాబా వీధిలో ఇటీవల నిర్మించిన కల్వర్టు



నిర్మించిన కొన్ని రోజులకే పిక్క తేలిన దృశ్యం



రోడ్డు కన్నా ఎత్తులో నిర్మించిన కల్వర్టు

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు సాయిబాబావీధిలో ఇటీవల నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా మారింది. మెయిన్‌రోడ్డు కంటే అడుగు ఎత్తుగా కల్వర్టు నిర్మించడంతో వాహనాలు పైకి ఎక్కే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఎత్తు వల్ల సాయిబాబా గుడి వైపు నుంచి వచ్చే వారు జారి పడుతున్నారు. తాజాగా ఆదివారం ఉదయం పలువురు వాహనంతో సహా పడటంతో స్వల్పగాయాల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతులు, కాళ్లు విరిగితే పరిస్థితి ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుకు సమాంతరంగా కల్వర్టు నిర్మించి ఉంటే ప్రమాదాలు జరిగేవి కావని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పనుల్లో నాణ్యతాలోపం..

కల్వర్టు నిర్మాణ పనుల్లో నాణ్యత కూడా లోపించిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కట్టి నెలరోజులు కూడా కాకుండానే పొడిలా మారి కంకర, పిక్క తేలిపోయాయని ఆరోపిస్తున్నారు. అందువల్లే ద్విచక్ర వాహన చోదకులు జారి పడిపోతున్నారని చెబుతున్నారు. పనుల్లో పర్యవేక్షణ లేకపోవటంతో కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా చేపట్టారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని వల్ల ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి కల్వర్టు ఎత్తు తగ్గించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేని ఎడల గోవింద్ రోడ్డును సమస్యాత్మకంగా మారిన సాయిబాబావీధి రోడ్డుకు సమాంతరంగా నిర్మించినా ప్రమాదాల తీవ్రత తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు.

జారిపడుతున్నారు..



కల్వర్టు నిర్మించిన దగ్గర నుంచి ఈ ప్రాంతంలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోజులో ఏదో ఒక సమయంలో వాహన చోదకులు జారి పడుతున్నారు. గాయాలపాలు అవుతున్నారు కూడా. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– జగదీష్, సాయిబాబావీధి

అధికారులు స్పందించి.. సరి చేయాలి..



రోడ్డుపై వేసిన పిక్క పైకి తేలడం, మలుపు కారణంగా వాహన చోదకులు ముఖ్యంగా ద్విచక్ర వాహన చోదకులు జారి పడుతున్నారు. ఫ్యామిలీలతో వెళ్లే సమయంలో మరింత ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి సరి చేయాలి.

–సాగర్, గోవింద్‌రోడ్డు

నిర్మాణ లోపమే కారణం..



కల్వర్టు నిర్మాణ లోపం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు సమస్య పరిష్కరించాలి. పనుల్లో నాణ్యత లేకపోవటంతో ఇసుక, పిక్క పైకి తేలుతున్నాయి. వాటి వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి. రోజూ కనీసం ఒకటి రెండు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

–రాము, డ్రైవర్, వెంకటేశ్వరమెట్ట

30న గ్యార్వీ షరీఫ్ ఉత్సవం



ఏసీపీ లక్ష్మణమూర్తికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న దృశ్యం

దాబాగార్డెన్స్: ఈ నెల 30న అంబేడ్కర్ భవన్‌లో గ్యార్వీ షరీఫ్ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం నగర ఏసీపీ లక్ష్మణమూర్తికి యాసీన్ మసీద్ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ ప్రతినిధి దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ యాసీన్ మసీదు ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్ వేదికగా నిర్వహించనున్న గ్యార్వీ షరీఫ్ వేడుకలకు ఉత్తరప్రదేశ్ నుంచి స్పీకర్, ముస్లిం మత గురువు సయ్యద్ సాబాత్ హుస్సేన్ హాజరు కానున్నారని చెప్పారు. ఏసీపీని కలిసిన వారిలో యాసీన్ మసీదు కమిటీ అధ్యక్షుడు ఖాజీ మహ్మద్ అహ్మదుల్లా ఖాన్, సంయుక్త కార్యదర్శి మహ్మద్ ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

దళితులపై జరిపిన పాశవిక దాడిని ఖండించండి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బన్న

దాబాగార్డెన్స్: శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం కిట్టుపురం గ్రామంలో దళితుడైన చల్లా అప్పలరాజు గత నెల 26 రాత్రి 9.30 గంటల ప్రాంతంలో మూత్ర విసర్జన చేస్తుండగా మా కారు పక్కన మూత్ర విసర్జన చేస్తావా అని పెత్తందార్లయిన ధర్మాన శ్రీను, ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో అనుచరులు అప్పలరాజుపై దాడి చేయడం దారుణమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం విశాఖ జిల్లా ప్రతినిధులు ఎం. సుబ్బన్న, టి. చిరంజీవి తెలిపారు. ఈ మేరకు సీపీఎం కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. పెత్తందార్లు తనను ఏమైనా చేస్తారేమోనని భయంతో అప్పలరాజు కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారని, అయితే ఎస్‌ఐ ఫిర్యాదు తీసుకోకుండా రేపు ఉదయం రమ్మన్నారని, పెత్తందార్లు తనను చంపుతారని అప్పలరాజు చెప్పగా, ఎస్‌ఐ కానిస్టేబుల్‌ను ఇచ్చి పంపారని తెలిపారు. కానిస్టేబుల్ ఇంటి వరకు వచ్చి తిరిగి వెళ్లిపోయాడని, అదే రాత్రి పెత్తందార్లు అప్పలరాజు ఇంటి మీదకు వచ్చి మా మీదే ఫిర్యాదు చేస్తావా, రేపు నిన్ను చంపేస్తామని బెదిరించి వెళ్లారని పేర్కొన్నారు. మరుసటి రోజు (అక్టోబర్ 27) ఉదయం 7.30 గంటలకు పెత్తందార్లు అప్పలరాజు ఇంట్లో చొరబడి విపరీతంగా కొట్టారన్నారు. అప్పలరాజు భార్య దమయంతిని ఇనుప రాడ్డుతో తలపై కొట్టగా ఆమె స్పృహ తప్పి పడిపోయిందన్నారు. పెత్తందార్లు ఆమె చనిపోయిందనుకుని పారిపోయారని తెలిపారు. అదే రోజు ఉదయం 9.30 గంటలకు దమయంతిని కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లగా ఎస్‌ఐ ఫిర్యాదు తీసుకోకుండా, పెత్తందార్లతో రాజీ చేసుకోమని, లేదంటే అప్పలరాజుపై నాలుగైదు కేసులు పెట్టి రౌడీషీట్ ఓపెన్ చేస్తామని బెదిరించారని తెలిపారు. పెత్తందార్ల అమానుష దాడుల నుంచి దళితులను రక్షించాలని, దోషులను రక్షించాలని చూస్తున్న కోటబొమ్మాళి ఎస్‌ఐని సస్పెండ్ చేయాలని కోరుతూ ఈ నెల 26 ఉదయం 10 గంటలకు కోటబొమ్మాళి ఎమ్మార్వో కార్యాలయం, పోలీస్ స్టేషన్ వద్ద దళితులచే పెద్ద ఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

విశాలాంధ్ర ప్రచురణలతో జ్ఞానం.. విజ్ఞానం

సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్ రాజు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు

మహారాణిపేట: విశాలాంధ్ర ప్రచురణలతో జ్ఞానం.. విజ్ఞానం సముపార్జించుకోవచ్చని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. ఆదివారం టర్నర్ సత్రంలో జరుగుతున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో పుస్తక ప్రదర్శనను విశాలాంధ్ర విజ్ఞాన సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలిసి సందర్శించారు. ముందుగా పుస్తక ప్రదర్శనకు విచ్చేసిన రాజుకు నాగేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలను వీక్షించారు. ఈ సందర్భంగా జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ మంచి పుస్తకాలు దొరికే చోటు విశాలాంధ్ర అని ఎవరిని అడిగినా చెబుతారన్నారు. ఇలాంటి పుస్తక ప్రదర్శనలతో అందరికీ విజ్ఞానం చేరువవుతుందన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో అనేక పుస్తకాలు ఒకే చోట లభ్యం కావడం అభినందనీయమన్నారు. అంకితభావంతో విశాలాంధ్ర నేటికీ అనేక ప్రాంతాల్లో పుస్తక ప్రదర్శనలు పెట్టి, పుస్తక ప్రియులకు ఎనలేని సేవ చేస్తుందని కొనియాడారు. పుస్తకాలకు ఆదరణ తగ్గలేదని చాటి చెప్పేలా విశాలాంధ్ర చేస్తున్న కృషి మెచ్చదగ్గది అన్నారు. సమితి చైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావును రాజు అభినందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రకాల పుస్తకాలు ప్రదర్శనగా ఉంచి ప్రజలకు మరింత చేరువ చేయాలని విశాలాంధ్ర కృషి చేస్తుందని తెలిపారు. విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనకు రాష్ట్రంలో ఆదరణ తగ్గలేదన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, అరసం కార్యదర్శి సీఎస్ క్షేత్రపాల్, సభ్యులు బొట్టా అప్పారావు, విశాలాంధ్ర దినపత్రిక విశాఖ ఎడిషన్ మేనేజర్ ననపల నరసింహులు, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ పీఏ రాజు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

సీతమ్మధార : ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించినా, రౌడీయిజం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ శ్రీను హెచ్చరించారు. ఈ మేరకు స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల రోజువారీ కార్యకలాపాలపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

వాసుపల్లి దాతృత్వం



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మరో సాయానికి ముందుకొచ్చారు. జీవీఎంసీ 37వ వార్డు జాలరిపేటకు చెందిన బుంగ ముత్యాలమ్మ అనారోగ్యంతో మంచం పట్టారు. ఆమె వైద్య ఖర్చులకు వాసుపల్లి ఆదివారం ఆశీల్‌మెట్టలో గల తన కార్యాలయంలో రూ.5 వేలు అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ కష్టంగా ఉన్న విషయం తెలుసుకున్న ఆయన సాయం చేసి ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్వేశ్వరరెడ్డి, బొరా విజయలక్ష్మి, శ్రీనివాసరావు, గనగళ్ల రామరాజు, చింతకాయల వాసు, ఆకుల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సీసీ రోడ్లు

- మట్టి రోడ్లను తలపిస్తున్న వైనం
- రాకపోకలకు అవస్థలు పడుతున్న ప్రజలు



కాలనీవాసులే సొంతంగా గోతులు పూడ్చుకున్న దృశ్యం



సెబాస్టియన్ కాలనీ రహదారి దుస్థితి

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలోని పలు కాలనీల్లోని సీసీ రోడ్లు అధ్వానంగా మారాయి. మట్టిరోడ్లను తలపిస్తున్నట్లు సిమెంటు, కాంక్రీట్ రోడ్లు ఉండటంతో పాదచారులు, వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటేనే ఆందోళన చెందుతున్నారు. గతంలో యూజీడీ, 24/7 పైపులైన్ల కోసం తీసిన గోతుల్లో పైపులు వేసి గోతులు పూడ్చి వదిలేశారు. ఎన్నికల కోడ్ రావడంతో అంతంతమాత్రంగా పనులు చేసిన జీవీఎంసీ అధికారులు అలాగే వాటిని ముగించేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు మాసాలు అయినా సీసీ రోడ్లు వేయకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు గోతులమయంగా మారాయి. జ్ఞానాపురం పరిధిలో ఎర్రిగెడ్డ వీధి, బాబూకాలనీ, సెబాస్టియన్‌కాలనీ, జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ, పోస్టాఫీస్ వీధి, సాలివీధి, స్లీపర్సు వీధి తదితర ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి మరీ దారుణంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. జోన్-5 ఇంజినీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఎన్నికల కోడ్ అంటూ నాడు కాలయాపన చేశారని, నేడు సీసీ రోడ్ల పట్ల అధికారులు కన్నెత్తి చూసే పరిస్థితి కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గెడ్డవీధి, సెబాస్టియన్ కాలనీ బాబూకాలనీలకు వెళ్లే ప్రధాన రహదారిలో పైపులైన్ కోసం తీసిన మట్టి ఇప్పటికీ రోడ్లలో సగం మేర ఉండడంతో అటుగా వెళ్లే ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆపై విద్యుత్ లైట్లు సక్రమంగా పని చేయకపోవడంతో పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఆయా కాలనీల్లో జరిగిన పనులపై జోనల్ అధికారులకే సరైన స్పష్టత లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇంజినీరింగ్ అధికారులతో సీసీ రోడ్ల నిర్మాణంపై మాట్లాడితే యూజీడీ, 24/7 డిపార్ట్‌మెంటు అధికారుల పర్యవేక్షణలో కాంట్రాక్టర్లు తవ్విన గోతులను వారే పూడ్చాలని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లు రాళ్లు తేలుతున్నాయి..



మా కాలనీలో గోతులు తవ్విన చోట కనీసం సీసీ రోడ్లు వేయలేదు. ఉన్న సీసీ రోడ్లు రాళ్లు తేలుతున్నాయి. రాకపోకల సమయంలో సీసీ రోడ్లలో నడవలేకపోతున్నాం. ద్విచక్ర వాహన చోదకులు జారి పడుతున్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని సచివాలయంలో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. వర్షాలు పడితే గెడ్డవీధిలో గోతులు కనిపించడంలేదు.

–జాన్ నానాజీ, వాహన చోదకుడు, జ్ఞానాపురం


అభివృద్ధికి విఘాతం..



కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు గడిచినా అభివృద్ధి పనులు జరగడంలేదు. నిధులు మంజూరు అయినా కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. గతంలో యూజీడీ పనులకు నిధులు మంజూరు చేయించాం. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆపేశారు. వార్డు కార్పొరేటర్‌గా పనులు చేపట్టాలని కాలనీ వాసులు వినతులు అందిస్తున్నా అధికారుల అలసత్వంతో పనులు జరగడంలేదు.

– కోడిగుడ్ల పూర్ణిమ, 41వ వార్డు కార్పొరేటర్

విద్యుద్దీప కాంతుల్లో శివాలయాలు



గణేష్ నగర్‌లో సుందరంగా అలంకరించిన శివాలయం

సీతమ్మధార : కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో పూజల కోసం ఉత్తర నియోజకవర్గంలో గల శివాలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. జీవీఎంసీ 14వ వార్డు గణేష్ నగర్‌లోని శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో చైర్మన్ టీఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో పలు రకాల పువ్వులతో ముస్తాబు చేశారు. నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కార్య నిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అదే విధంగా నియోజకవర్గంలోని పలు ఆలయాలు ప్రత్యేక పూజల కోసం సిద్ధమయ్యాయి. అలాగే అల్లిపురం, దొండపర్తి మార్కెట్లలో పూజా సామగ్రి అమ్మకాలు కూడా ఊపందుకున్నాయి.

కుటుంబ సభ్యుల చెంతకు అభాగ్యులు



జయమ్మను కుమారుడికి అప్పగిస్తున్న మేనేజర్ జ్యోతిర్మయి, కానిస్టేబుల్ ప్రకాశరావు



టీఎస్ఆర్ షెల్టర్‌లో తిరుపతిరావు

సీతమ్మధార: పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు గ్రామానికి చెందిన పలివెల జయమ్మ (62) మానసిక ఆరోగ్యం సరిగా లేక, ఎవరో తరుముతున్నారంటూ ఇంట్లో చెప్పా పెట్టకుండా వైజాగ్ వచ్చేసింది. ద్వారక నగర్ రోడ్డులో తిరుగుతుంటే పోలీసులు చూసి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు టీఎస్ఆర్ మహిళా షెల్టర్‌లో ఆమెను చేర్పించారు. ఆమె దగ్గర కుమారుడి ఫోన్ నంబర్ తీసుకుని సమాచారం అందజేయడంతో ఆమె కుమారుడు పలివెల శ్రీను షెల్టర్‌కు వచ్చారు. మేనేజర్ జ్యోతిర్మయి, ద్వారక కానిస్టేబుల్ ప్రకాశరావు సమక్షంలో జయమ్మను కుమారుడు శ్రీనుకు ఆదివారం అప్పగించారు.

టీఎస్ఆర్ షెల్టర్‌కు తిరుపతిరావు..

మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన జంగేటి తిరుపతిరావు (61) కాంప్లెక్స్‌లో తిరుగుతుంటే ద్వారకా పోలీసులు ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు టీఎస్ఆర్ షెల్టర్‌లో తిరుపతిరావుకు వసతి కల్పించారు. తిరుపతిరావు వ్యసనాలకు బానిసై ఇల్లు వదిలి విశాఖ వచ్చేశాడు. కుటుంబ సభ్యులను రప్పించి ఆదివారం అతన్ని అప్పగించారు.

వ్యక్తి అదృశ్యం



తప్పిపోయిన మహేష్ (ఫైల్)

అల్లిపురం: తన భర్త డ్యూటీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని నీలమ్మ వేపచెట్టు ప్రాంతానికి చెందిన కె. కృష్ణవేణి శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం మదు మహేష్ (27) తన భార్య కర్రి కృష్ణవేణితో కలిసి నీలమ్మ వేపచెట్టు ప్రాంతంలో నివసిస్తున్నారు. అతను బ్లాక్ క్యాట్ సెక్యూరిటీలో పని చేస్తుండగా, అతని భార్య కృష్ణవేణి సెవన్ హిల్స్ ఆస్పత్రి క్యాంటీన్‌లో పని చేస్తున్నారు. ఈ నెల 17వ తేదీన ఆమెను పని ప్రాంతంలో దించి అతను డ్యూటీకి వెళ్లారు. ఆరోజు సాయంత్రం డ్యూటీ అయిపోయిన తర్వాత భార్య కృష్ణవేణిని తీసుకెళ్లేందుకు రాలేదు. దీంతో ఆమె ఫోన్ చేయగా తాను వస్తానని నిరీక్షించమని చెప్పారు. అయితే ఎంతకీ అతను రాకపోయేసరికి కృష్ణవేణి అతనికి ఫోన్ చేశారు. అయితే ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. సంబంధిత డ్యూటీ వారిని ప్రశ్నించగా అతను డ్యూటీ నుంచి వెళ్లిపోయాడని చెప్పారని, ఇంటికెళ్లి చూడగా అతని వాహనం కనిపించలేదు. అతనితో పని చేస్తున్న యల్లాజీ అనే వ్యక్తిని అడిగితే తాను విజయవాడ వెళ్తున్నట్లు చెప్పాడని కృష్ణవేణి తెలిపారు. దీంతో ఆమె విజయవాడ వెళ్లి అతని తల్లిదండ్రులను వాకబు చేయగా అక్కడికి రాలేదని వారు చెప్పారు. దీంతో ఆమె విశాఖపట్నం వచ్చి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 8919812412 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని పోలీసులు కోరారు.

బాబోయ్ యూటర్న్

- నిత్యం ట్రాఫిక్ జామ్
- ఆశీలుమెట్ట వద్ద నరకం చూస్తున్న ప్రయాణికులు



ఆశీలుమెట్ట వద్ద ప్రమాదభరితంగా ఉన్న యూటర్న్ మార్గం

సీతమ్మధార: ట్రాఫిక్ జామ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు స్టాపర్‌బోర్డులు ఏర్పాటు చేయడమో, దారి మూసేయడమో చేస్తుంటారు. కానీ ఆశీలమెట్టలో ఒక చోట మాత్రం లేని సమస్య సృష్టించి నిత్యం ట్రాఫిక్ జామ్ అయ్యేలా చేయడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ఆశీలమెట్ట జీవీఎంసీ జోన్-3 కార్యాలయం ఎదురుగా ఉన్న సబ్‌వే ప్రవేశమార్గంలో గల యూ టర్న్ మార్గం వాహన చోదకుల సహనాన్ని పరీక్షిస్తుందంటే అతిశయోక్తి కాదు. మూడవ పట్టణం, ద్వారకా స్టేషన్ల సరిహద్దు అయిన ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఆర్టీసీ కాంప్లెక్సు లోపలి మార్గం నుంచి నిత్యం శ్రీకాకుళం, విజయనగరం, టెక్కలి, పార్వతీపురం, బొబ్బిలి, పాలకొండ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే లైన్ బస్సులు రామా టాకీస్ వైపు వెళ్తూ ఈ మార్గం మీదుగా వస్తుంటాయి. అధిక సంఖ్యలో బస్సులు వచ్చే ఈ మార్గంలో సైతం యూ టర్న్ ఉన్న కారణంగా రామాటాకీస్ మీదుగా వచ్చి వెనక్కి వెళ్లేందుకు యూ టర్న్ తీసుకునే సమయంలో వెనుక నుంచి, ముందు నుంచి వచ్చే వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోవాల్సి రావడం తీవ్ర దుమారం రేపుతోంది. రామా టాకీస్ నుంచి వచ్చే వాహనాలు సబ్‌వేలో ప్రవేశించేటపుడు తరచూ పలువురు వాహన చోదకులు యూటర్న్ తిరిగే సమయంలో ట్రాఫిక్ ఆగిపోవడం, వాహన చోదకులు హారన్ల మోత మోగించడం ఇక్కడ నిత్యకృత్యం అన్నట్టుగా మారిపోయింది. అలాగే యూ టర్న్ తిరిగే వాహనాలు ఎడమ వైపు తిరిగేటపుడు ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి వచ్చే సిటీ బస్సులు కూడా డెడ్‌స్లో చేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. పైగా ఇక్కడ ట్రాఫిక్ గస్తీ కూడా లేదు. దీంతో నిత్యం ఇక్కడ నరకం చూడాల్సి వస్తుందని వాహన చోదకులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ యూటర్న్ మార్గం మూసేసి డివైడర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.